## క్లుప్తంగా

### పోలింగ్ కేంద్రం పరిశీలన



అల్లవరంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ మాధవి

**అల్లవరం:** ఉమ్మడి గోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అల్లవరం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల కేంద్రాన్ని ఆర్డీఓ మాధవి మంగళవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల నిమిత్తం అమలాపురం డివిజన్‌లో 45 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. సుమారు 35 వేల మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద తాగునీరు, వైద్య శిబిరాలు ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. ఆమె వెంట తహసీల్దార్ వీవీఎల్ నరసింహరావు, ఎస్సై హరీష్ కుమార్, ఎంపీడీఓ కృష్ణప్రసాదు, ఆర్ఐ మన్యం, హెచ్ఎం వెంకటేశ్వరరావు, వీఆర్ఓ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

**తాళ్లరేవు:** ఈ నెల 27వ తేదీన జరగనున్న ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ పితాని త్రినాథరావు తెలిపారు. మంగళవారం ఆయన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 2,514 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీరికి మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### వీధి దీపాలు ప్రారంభించిన సర్పంచి

**కాట్రేనికోన:** బ్రహ్మ సమేథ్యం పంచాయతీ పరిధిలోని బలుసుతిప్ప, మగసానితిప్ప, కొత్తపాలెం, నీళ్లరేవు, గొల్లపేట గ్రామాలలో ఎల్ఈడీ ఫ్లెడ్‌లైట్లను (వీధి దీపాలు) సర్పంచి మల్లాడి ఏడుకొండలు ప్రారంభించారు. పంచాయతీ నిధులు రూ.1.50 లక్షలతో వీధి దీపాలను వేయించారు. గ్రామ ప్రధాన సెంటర్లతో పాటు బలుసుతిప్ప వంతెనకు ఇరువైపులా వీటిని అమర్చారు. నాయకులు ఓలేటి సతీష్, పంతాడి సతీష్, సంగాని చిన్ని, వివిధ గ్రామాలకు చెందిన పెద్దల సమక్షంలో వీటిని సర్పంచి ప్రారంభించారు.

### వైభవంగా వీరభద్రస్వామి బోణాలు

**ముమ్మిడివరం:** ముమ్మిడివరంలో గణేశుల వారి వీరభద్రుని బోణాలు మంగళవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కులదైవంగా భావించే వీరభద్రుని ప్రతి రూపాన్ని తలపై పెట్టుకుని భాజా భజంత్రీలు, సన్నాయి మేళాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లి స్థానిక షిర్డీసాయిబాబా మందిరం వద్ద పంట కాలువలో మంగళస్నానం చేయించారు. అనంతరం జమ్మిచెట్టు వద్ద స్వామివారి బోణాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గణేశుల బ్రహ్మానందం, కుటుంబ సభ్యులు, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, పెన్మత్స చిట్టిరాజు, గోదశి నాగేశ్వరరావు, కోలా బాబ్జీ, చెల్లి అశోక్, ములపర్తి బాలకృష్ణ, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

### మురికివాడల్లో మలేరియా సర్వే

**అమలాపురం టౌన్:** మనం నివసించే పరిసరాల్లో దోమల పుట్టుకను ఆదిలోనే అంతం చేసే అదుపు చర్యలు ఉన్నాయని, వాటిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని రాజమహేంద్రవరం ఎంటమాలజికల్ టీమ్ జోనల్ మలేరియా అసిస్టెంట్ డైరెక్టర్ బీఎల్ఎన్ కుమార్ సూచించారు. ఆయనతో పాటు మలేరియా నియంత్రణ టీమ్‌కు చెందిన ప్రతినిధులు స్థానిక మురికివాడలైన మున్సిపల్ కాలనీ, ఉప్పర కాలనీల్లో మంగళవారం ఇంటింటా తిరిగి దోమల పుట్టుకకు అవకాశం ఉన్న పరిస్థితులపై అధ్యయనం చేశారు. ఇళ్ల వద్ద, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు ఉన్న వస్తువులను ఈ టీమ్ ప్రతినిధులు గుర్తించి వాటిలోని నిల్వ నీటిని తొలగించారు. అనంతరం టీమ్ ప్రతినిధులు మలేరియా పరంగా ఇంటింటి సర్వే చేసి వివరాలు సేకరించారు. వీరివెంట అమలాపురం మలేరియా డిపార్ట్‌మెంట్ సిబ్బంది, ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

### దీన్ దయాళ్ అంత్యోదయ కమిటీ సభ్యునిగా యల్లమిల్లి

**అమలాపురం టౌన్:** నిరుద్యోగ యువతకు ఆసరా కల్పించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం దీన్ దయాళ్ అంత్యోదయ యోజన ద్వారా ఉపాధి, ఉద్యోగ కల్పనకు ఓ కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్లు అమలాపురం ఆజాద్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యల్లమిల్లి నాగ సుధా కొండలరావు తెలిపారు. ఈ కార్పొరేషన్‌కు ప్రతీ మున్సిపాలిటీ స్థాయిలో కమిషనర్‌ను చైర్మన్‌గా ఎంపిక చేసి పలువురు అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో ఓ కమిటీ ఏర్పాటు చేసినట్లు వివరించారు. అమలాపురం మున్సిపాలిటీ, ముమ్మిడివరం నగర పంచాయతీకి సంబంధించిన కమిటీలో తనను సభ్యుడిగా నియమించినట్లు తెలిపారు.

### డంపింగ్ యార్డును కాపాడుకోవాలి

**యానాం:** 25 ఏళ్లుగా వందల టన్నుల కొద్దీ వ్యర్థాలు, చెత్తను వేయడంతో కొండలా పెరిగిపోయిన కనకాలపేట డంపింగ్ యార్డును నిలుపుదల చేసామని భవిష్యత్‌లో చెత్తను రవాణా చేయకుండా దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత గ్రామస్తులపై ఉందని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. సోమవారం ఆయన కనకాలపేట డంపింగ్‌యార్డు వద్ద కనకాలపేట, యుకెవి నగర్, భీమ్‌నగర్ తదితర ప్రాంతాల ప్రజలతో మాట్లాడారు.



ముమ్మిడివరంలోని ఉమా సూరేశ్వరస్వామి



కాట్రేనికోనలో పార్వతీ సమేత కుండలేశ్వరస్వామి



ఐ.పోలవరంలో అలరిస్తున్న విద్యుత్ దీపాలంకరణ



వీరేశ్వర స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

# శివపూజకు వేళాయె..

- శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన శైవ క్షేత్రాలు
- ఆలయాల వద్ద భారీ ఏర్పాట్లు
- ప్రత్యేక అభిషేకాలు, పూజలు

**ముమ్మిడివరం:** పరమ శివుడికి ప్రీతికరమైన మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని నియోజకవర్గంలోని శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. ఆలయాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. నియోజకవర్గంలోని నిత్యకల్యాణం–పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి, ముమ్మిడివరం ఉమా సూరేశ్వరస్వామి, కుండలేశ్వరంలోని కుండలేశ్వరస్వామి ఆలయాలు ప్రముఖ శైవ క్షేత్రాలుగా విరాజిల్లుతున్నాయి. వీటితో పాటు అయినాపురంలోని ఉమా సోమేశ్వరస్వామి, అన్నంపల్లి పార్వతీ గౌతమేశ్వర స్వామి, కొమానపల్లి పార్వతీ సమేత చోడేశ్వర లోకేశ్వరస్వామి, కొత్తలంక ఉమా భోగేశ్వరస్వామి, క్రాపచింతల పూడి ఉమా వల్లభేశ్వర స్వామి, తానేల్లంక ఉమా సోమేశ్వరస్వామి ఆలయాలతో పాటు కాట్రేనికోన మండలం మాగసాని తిప్ప కాలభైరవస్వామి, కాట్రేనికోన, ఉప్పూడి, పెనుమళ్ల, చెయ్యేరు, కందికుప్ప, గెద్దనపల్లిలో శివాలయాలు, ఐ.పోలవరం మండలం మురమళ్ల భద్రకాళీసమేత వీరేశ్వరస్వామి, బాణాపురం భాణేశ్వరస్వామి, గుత్తెనదీవి పార్వతీ సమేత రాజేశ్వరస్వామి, ఎదుర్లంక కామాక్షీ చంద్రమౌళీశ్వరస్వామి, తాళ్లరేవు మండలంలోని కోరంగి బాలాత్రిపుర సుందరీ సమేత కురంగేశ్వరస్వామి, కేశవపురం భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి, ఇంజరంలోని ఉమా కృపేశ్వరస్వామి, నీలపల్లి నీలకంఠేశ్వరస్వామి, చొల్లంగి సంగమేశ్వర స్వామి ఆలయాలు మహా శివరాత్రి వేడుకలకు సిద్ధమయ్యాయి. భక్తుల సౌకర్యార్థం ఆలయాల వద్ద నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. పర్వదినాన్ని పురస్కరించుకొని పలు ఆలయాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

**అమలాపురం టౌన్:** శివరాత్రి మహోత్సవాలకు పట్టణంలోని శివాలయాలు అలంకృతమయ్యాయి. అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపించేందుకు ఆయా ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. పట్టణంలోని పురాతన శివ క్షేత్రం చెన్న మల్లేశ్వరస్వామి దేవస్థానం, మెయిన్ రోడ్డులో గల సిద్ధేశ్వరస్వామి, రవణం వీధి శివాలయం రోడ్డులో గల రామలింగేశ్వరస్వామి, సుబ్బారాయుడి చెరువు వద్ద గల చంద్రమౌళీశ్వరస్వామి, ఎన్టీఆర్ మార్గ్‌లో గల ఉమా నాగలింగేశ్వరస్వామి ఆలయాలను కమిటీలు భక్తుల దర్శనాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేశాయి. రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఆలయ అనువంశిక ధర్మకర్తల మండలి చైర్మన్ మాచిరాజు రవికుమార్, చెన్న మల్లేశ్వరస్వామి దేవస్థానం వద్ద దేవదాయ శాఖ అధికారులు భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించారు. సిద్ధేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. ఆ ఆలయం వద్ద మెయిన్ రోడ్డుపై భారీ ఎత్తున విద్యుత్ దీపాలంకరణతో సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. స్థానిక రవణం వీధిలోగల బ్రహ్మకుమారీస్ హార్మోనీ హౌస్‌లో 89వ త్రిమూర్తి శివ జయంతి మహోత్సవాలను శివరాత్రి రోజున సాయంత్రం 6 గంటల నుంచి నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు.

**ఐ.పోలవరం:** నిత్య కల్యాణం పచ్చ తోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఆలయంలో నేటి నుంచి మార్చి 2వ తేదీ వరకు జరగబోయే మహా శివరాత్రి మహోత్సవాల ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. గతం కన్నా ఈ ఏడాది భక్తులు అధిక సంఖ్యలో వస్తారని అంచనా వేస్తున్నారు. అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేస్తున్నారు. మహా శివరాత్రి నాడు సమీపంలోని వృద్ధ గౌతమీ నదీపాయలో పుణ్యస్నానాలు చేసి స్వామివారిని దర్శించుకుంటారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయ ఆవరణ వెలుపల చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఎల్ఈడీ లైట్లతో దేవతామూర్తుల అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు, వృద్ధులు, దివ్యాంగులకు సైతం సునాయాసంగా స్వామివారి దర్శనం జరిగేలా ప్రత్యేక క్యూ లైన్లు, దర్శనం లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. చంటి పిల్లలకు పాలు, బిస్కెట్లు అందించనున్నారు. ఐదు రోజుల పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మహా శివరాత్రికి స్వామి, అమ్మవార్లను భక్తులు తిలకించేందుకు ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. ఆలయ పరిసర ప్రాంతాలలో సీసీ కెమేరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించనున్నారు. ఐదు రోజుల ఉత్సవాలకు సీఎఫ్‌వోగా దేవదాయశాఖ తనిఖీ అధికారి రామలింగేశ్వరరావు వ్యవహరిస్తారని ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీ నారాయణ తెలిపారు.

**కాట్రేనికోన:** మండల పరిధిలోని శివాలయాలు మహా శివరాత్రి వేడుకలకు సిద్ధమయ్యాయి. ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలలో ఒకటైన కుండలేశ్వస్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాల అలంకరణతో అత్యంత సుందరంగా అలంకరించారు. భారీ స్థాయి అన్న సమారాధనకు ఏర్పాట్లు చేస్తున్నారు. బ్రహ్మసమేథ్యం పంచాయతీ మగసానితిప్ప, పల్లం గ్రామం కాలభైరవస్వామి ఆలయాల్లో శివరాత్రి మహోత్సవాలకు ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశాయి.



అమలాపురం మెయిన్ సెంటరులో సిద్ధేశ్వర స్వామి ఆలయం వద్ద విద్యుద్దీపాలంకరణ

## రేపు భగవాన్ బాలయోగీశ్వరుల తీర్థం



బాల యోగీశ్వరుల తపో ఆశ్రమం



భగవాన్ పెద బాలయోగీశ్వరులు

- ముస్తాబైన తపో ఆశ్రమం

**ముమ్మిడివరం:** ముని మండలంగా ప్రసిద్ధి గాంచిన ముమ్మిడివరంలో అడుగడుగునా ఆధ్యాత్మికత ఉట్టిపడుతోంది. నాలుగు దశాబ్దాల పాటు కఠోర తపస్సు ఆచరించి ముక్తి పొందిన భగవాన్ బాలయోగీశ్వరుల తపో ఆశ్రమంలో గురువారం తీర్థ మహోత్సవాలు జరగనున్నాయి. శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని బుధవారం బాల యోగీశ్వరుల దివ్య సమాధుల వద్ద ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం అన్న సమారాధన, రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గురువారం తెల్లవారు జాము 4 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు దర్శన మండపంపై బాల యోగీశ్వరుల పరబ్రహ్మమూర్తి విగ్రహ దర్శనం, దివ్య సమాధుల దర్శనం ఉంటుంది.

**కఠోర తపస్సు చేసిన బాలయోగీశ్వరులు..**

ముమ్మిడివరంలో కటికదల గంగయ్య, రామమ్మ దంపతులకు సుబ్బారావు 1930 అక్టోబరు 23న జన్మించారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన సుబ్బారావు పశువుల కాపరిగా జీవనం సాగిస్తూ భక్తిభావం అలవర్చుకున్నారు. స్థానిక లంకతల్లమ్మ తీర్థంలో కృష్ణుడు, నారదుడు ఫోటోలను కొని తెచ్చుకుని కొబ్బరి తోటలో కొబ్బరి చెట్టు కింద పెట్టి వాటి ముందు గంటల తరబడి ధ్యానంలో నిమగ్నమయ్యేవారు. 1946జూన్ 22న కృష్ణ నామ స్మరణతో తపస్సును ప్రారంభించారు. ఎండ, వాన లెక్క చేయకుండా నిద్రాహారాలు మాని ధ్యానంలో గడిపేవారు. అతని సోదరుడు సైతం తపస్సులో పాల్గొన్నారు. బాల్య దశలోనే జ్ఞాన నిరతిని కలిగిన ఈ సోదరులు బాలయోగీశ్వరులుగా ప్రసిద్ధి చెందారు. సుమారు 40 ఏళ్లపాటు కఠోర తపస్సు చేసి ఈ ప్రాంతానికి చారిత్రాత్మకంగా పేరు తెచ్చారు. తపో ఆశ్రమంలో నిరంతరం తపస్సు ఆచరిస్తూ ఏటా శివరాత్రి మరునాడు భక్తులకు ప్రత్యక్ష దర్శనమిచ్చేవారు. దేశ, విదేశాల నుంచి లక్షలాది భక్తులు దర్శనార్థం వచ్చేవారు. 1985 జూలై 19న పెదబాలయోగీ, 1991 అక్టోబరు 28న చిన బాలయోగీశ్వరులు కైవల్య సిద్ధి పొందారు. గురువారం జరిగే తీర్థ మహోత్సవాలను పురస్కరించుకొని వేలాది మంది భక్తులు బాలయోగీశ్వరుల సమాదులను దర్శించుకుంటారు.

## ముగిసిన జ్ఞానజ్యోతి శిక్షణ



చెయ్యేరులో శిక్షణ పొందిన అంగన్‌వాడీలతో ఐసీడీఎస్ సిబ్బంది

**కాట్రేనికోన:** మండలంలో చెయ్యేరు జెడ్పీహెచ్ పాఠశాల నందు అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి పేరిట ఆరు రోజుల శిక్షణా తరగతులు మంగళవారంతో మగిశాయి. ఐసీడీఎస్ సూపర్ వైజర్ తులసి అధ్యక్షతన ఈ శిక్షణా తరగతులకు ప్రోగ్రామ్ కోఆర్డినేటరుగా ఎంఈఓ–2 వెంకటరమణ హాజరై మాట్లాడారు. నూతన విద్యా విధానంలో భాగంగా ప్రతి అంగన్‌వాడీ కార్యకర్తకు 120 రోజుల పాటు శిక్షణ అందించినట్లు పేర్కొన్నారు. శిక్షణ పొందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు ధ్రువీకరణ పత్రాలను అందచేశారు. డీఆర్‌పీలు శ్రీరామ్, పృథ్వి, హెచ్ఎం శేషసాయి , అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**ముమ్మిడివరం:** ప్రాథమిక విద్యలో నాణ్యమైన బోధనను కొనసాగించాలని ఎంఈఓ, కోర్సు డైరెక్టర్ ఉదయ భాస్కరరావు సూచించారు. మండల స్థాయిలో అంగన్‌వాడీ టీచర్లకు ఆరు రోజుల జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ విమల, డీఆర్‌పీలు ఎస్.నాగరాజు, హిమబిందు, పల్లవి, శ్రీదేవి పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి క్విజ్ విజేతలకు బహుమతుల అందజేత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

**అమలాపురం టౌన్:** ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ సైన్స్‌ఫోరం, జిల్లా సైన్స్ విభాగం సంయుక్తంగా నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీల నిర్వహణ పూర్తయింది. జాతీయ విజ్ఞానశాస్త్ర దినోత్సవం సందర్భంగా మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన 8, 9వ తరగతుల విద్యార్థులకు బహుమతులు అందజేశారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు. ఫిజికల్ సైన్స్ ఫోరం అధ్యక్షుడు బెహరా మూర్తి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎస్.రాజరాజేశ్వరి, వి.విజయకుమారిలు విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. మొదటి మూడు స్థానాలు సాధించిన అమలాపురం రూరల్, ఆలమూరు, కాట్రేనికోన మండలాల విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విజేతలను డీఈవో డాక్టర్ షేక్ సలీమ్ బాషా, డీవైఈవో గుబ్బల సూర్యప్రకాశం, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం అభినందించారు. పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

**ఉప్పలగుప్తం:** మండలంలోని విలసలవిల్లి గ్రామంలో చేనేత కార్మికుడు నల్లా వీర్రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన భార్య పోలమ్మకు గ్రామస్తులు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని మంగళవారం అందించారు. గ్రామానికి చెందిన ఎస్ఆర్ఐలు సమకూర్చిన ఆర్థిక సాయాన్ని వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్ చేతుల మీదుగా పోలమ్మకు అందించారు. కార్యక్రమంలో పుత్స్యల ఏసు, దాసరి శర్మ, అడబాల సురేష్, అత్తిలి గోపి, కాశిన అప్పారావు, బళ్ల లక్ష్మణ్, సూరిశెట్టి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినికి పోస్టల్ స్కాలర్‌షిప్ అందజేత



విద్యార్థినికి స్కాలర్‌షిప్ అందజేస్తున్న సూపరింటెండెంట్ నవీన్‌కుమార్

**అమలాపురం టౌన్:** పోస్టల్ స్టాంపులపై విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు, వారి ఉన్నత విద్యకు తోడ్పాటు అందించడం కోసం ఏటా పోస్టల్ శాఖ దీన్ దయాళ్ స్పర్శ్ యోజన స్కాలర్‌షిప్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అమలాపురం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్.నవీన్‌కుమార్ అన్నారు. స్థానిక పోస్టల్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగిన స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమంలో సూపరింటెండెంట్ నవీన్‌కుమార్ మాట్లాడారు. ఈ పరీక్షలకు 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులు అర్హులని చెప్పారు. పరీక్షల్లో విజేతలైన విద్యార్థులకు ఏటా రూ.6 వేలు స్కాలర్‌షిప్‌ను అందిస్తారన్నారు. ఈ స్కాలర్ షిప్‌కు పోస్టల్ డివిజన్‌లో ఎంపికైన అమలాపురం వాగ్దేవి స్కూలు విద్యార్థిని శ్రీవల్లి శరణ్యకు రూ.6 వేల స్కాలర్‌షిప్‌ను అందజేశారు కార్యక్రమంలో పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ కె.శ్రీధరం, శ్రీవాగ్దేవి స్కూలు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు. విజేతను అభినందించారు.

## సేవ్ ద పీపుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

**జేసీ నిషాంతి**



షణ్ముఖ తల్లికి చెక్కును అందజేస్తున్న జేసీ నిషాంతి

**అమలాపురం రూరల్:** సేవ్ ద పీపుల్ ట్రస్ట్ ఆపదలో ఉన్న వారి కష్టాలను స్వయంగా తెలుసుకుని ఆర్థిక సాయం చేయడం అభినందనీయమని జిల్లా జాయింట్ కలెక్టర్ నిషాంతి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో డి.ముప్పవరానికి చెందిన సానం రేవంత్ నాగ షణ్ముఖ విద్యాభ్యాసం కోసం ట్రస్టు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని జేసీ చేతుల మీదుగా అందజేసింది. జేసీ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి మేమున్నామనే భరోసాను కల్పించడం ద్వారా ట్రస్ట్ నిబద్ధతను చాటుకుందన్నారు. నిడదవోలు మండలం డి ముప్పవరం గ్రామానికి చెందిన సానం శ్రీనివాసరావు, అనంత కుమారి దంపతుల కుమారుడు షణ్ముఖ ఐదో తరగతి చదువుతున్నాడని తండ్రి శ్రీనివాసరావు కరోనా సమయంలో మృతిచెందడంతో కుటుంబం ఆర్థికంగా చితికిపోయిందన్నారు. విద్యార్థి చదువుకు ఆర్థిక సాయం అందించేందుకు ట్రస్టు ముందుకొచ్చిందన్నారు. ట్రస్టు ప్రతినిధి సుంకర సుధీర్, మానస, సుప్రియలు పాల్గొన్నారు.

## గడువులోగా రీసర్వే పూర్తి చేయాలి

జాయింట్ కలెక్టర్ నిషాంతి



ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణపై మాట్లాడుతున్న జేసీ నిషాంతి

**అమలాపురం రూరల్:** జిల్లాలో 17 గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియ కొనసాగుతోందని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. రీ సర్వేలో కచ్చితత్వానికి అత్యంత ప్రాధాన్యమివ్వాలని, తప్పిదాలకు తావు లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం అమరావతి నుంచి భూ పరిపాలన ముఖ్య కమిషనర్ జి.జయలక్ష్మి, అదనపు కార్యదర్శి ఎన్‌ప్రభాకర్‌రెడ్డి వివిధ జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెవెన్యూ సదస్సులు, రీ సర్వే, ఆక్రమణల క్రమబద్ధీకరణ వంటి అంశాల్లో పురోగతిపై సమీక్షించారు. అనంతరం జేసీ నిషాంతి అధికారులతో మాట్లాడుతూ, భూముల రీ సర్వేపై రైతుల అనుమానాలను నేరుగా నివృత్తి చేయాలన్నారు. రైతులతో వాట్సాప్ గ్రూప్ రూపొందించి, ఎప్పటికప్పుడు రీ సర్వే వివరాలను పోస్ట్ చేయాలని ఆదేశించారు. గ్రామ సర్వేయర్లకు ఇతర విధులు కేటాయించవద్దని సర్వే, ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కె.ప్రభాకర్‌ను ఆదేశించారు.

**ఇంటర్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు**

ఇంటర్మీడియెట్ పరీక్షలు సజావుగా జరిగేలా పటిష్ట ఏర్పాట్లు చేయాలని జేసీ నిషాంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ పరీక్షల ఏర్పాట్లపై సమీక్షించారు. మార్చి 1 నుంచి 20 వరకు పరీక్షలను అధికారులు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలతో పటిష్ఠ నిఘా ఏర్పాటు చేస్తారన్నారు. మాల్ ప్రాక్టీస్, మాస్ కాపీయింగ్ వంటి సంఘటనలు జరిగితే ఆన్‌లైన్ స్క్రీనింగ్ అనుసంధానంతో ఉన్నతాధికారులకు వెంటనే తెలుస్తుందని, క్షణాల్లో చర్యలు చేపడతారన్నారు. చీఫ్ సూపరింటెండెంట్‌కు మాత్రమే కీప్యాడ్ సెల్‌ఫోన్ అనుమతి ఇస్తారన్నారు. ప్రశ్నా పత్రాలను 14 స్టోరేజ్ పాయింట్లలో మూడు సెట్ల చొప్పున భద్రపర్చారని, పరీక్షా కేంద్రాల్లో ఉదయం 8:45కు బండిల్స్‌ను తెరిచి, 9 గంటలకు గదులకు తరలిస్తారని తెలిపారు. పది ఫ్లయింగ్, మూడు సిట్టింగ్, ఒక డీఈసీ స్క్వాడ్ ఏర్పాటు చేశారన్నారు. జిల్లాలో 40 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి వనుం సోమశేఖరరావు తెలిపారు. మొత్తం 27,313 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు చెప్పారు. డీఆర్ఓ రాజకుమారి, డీఎస్పీ ప్రసాద్, జెడ్పీ కమిటీ డీఈసీ వై.లక్ష్మణరావు, ప్రత్యేకాధికారి ఏసుబాబు, డీఈవో షేక్ సలీంబాషా తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధారణపై అవగాహన



హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్సై ఏసుబాబు

**అమలాపురం టౌన్:** మేము స్థానికులమే.. మాకెందుకు హెల్మెట్ అని చెబుతున్న ద్విచక్రవాహన చోదకులు తొలుత ఆ అభిప్రాయాన్ని విడిచిపెట్టాలని అమలాపురం పట్టణ ట్రాఫిక్ ఎస్సై ఏసుబాబు సూచించారు. స్థానిక ఎర్ర వంతెన వద్ద హెల్మెట్లు పెట్టుకోకుండా డ్రైవింగ్ చేస్తున్న ద్విచక్ర వాహనదారులను ఆపి ఎస్సై ఏసుబాబు మంగళవారం ఉదయం కౌన్సెలింగ్ ఇచ్చారు. ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించేందుకు ఎస్సై స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. హెల్మెట్ ధారణ అనేది తప్పనిసరి కావాలని సూచించారు.

**28న ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు**

జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశాలతో డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ ఆధ్వర్యంలో పట్టణ సీఐ పి.వీరబాబు పర్యవేక్షణలో హెల్మెట్ ధారణపై స్పెషల్ డ్రైవ్‌లు, కౌన్సెలింగ్‌లు తరచూ నిర్వహిస్తున్నామని ఎస్సై ఏసుబాబు తెలిపారు. ఈనెల 28న స్థానిక సూర్యానగర్ శివారు కొబ్బరితోటలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సదస్సుకు ఆటో డ్రైవర్లు విధిగా హాజరు కావాలని సూచించారు.

## పార్వతీ పరమేశ్వరుల దివ్యకల్యాణం



పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

**అమలాపురం రూరల్:** మండలంలో పాత బండారు లంకలోని భువనేశ్వరీ సమేత త్రయంబకేశ్వర స్వామి ఆలయంలో పార్వతీ పరమేశ్వరుల దివ్య కల్యాణాన్ని మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం శ్రీశైలం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, చంద్రకళ దంపతులు ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

## లాస్య కుటుంబాన్ని ఆదుకోవాలి

**అల్లవరం:** గోడిలోని కొత్త కాలనీలో డాబాపై విద్యుత్ షాక్‌కు గురై కుడిచేతిని కోల్పోయిన చిన్నారి కేతా లాస్యమాధూరిని విద్యుత్ అధికారులు పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని మానవ హక్కుల వేదిక కార్యవర్గ సభ్యులు ముత్యాల శ్రీనివాసరావు అన్నారు. గోడిలోని లాస్య, తల్లి రామాదేవిని మంగళవారం పరామర్శించి బాధితులతో మాట్లాడారు. లాస్య కుటుంబానికి న్యాయం జరగకపోతే మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో ఉద్యమించి బాధితులకు అండగా ఉంటామన్నారు.